నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రాజేంద్రనగర్ ఏఈ తెలిపారు. ఉప్పర్‌పల్లి (రాజేంద్రనగర్) ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు. ఫోర్ట్ వ్యూవ్ కాలనీ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే బుద్వేల్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. గాంధీనగర్ (ఐసీఏఆర్) ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



రాజేంద్రనగర్: బుద్వేల్ కోట మైసమ్మ ఆలయంలో వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని చూడముచ్చటగా అలంకరించారు. తెల్లవారుజామున పంచామృత అభిషేకంతో వారాహి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన లహరి శ్రీ



విద్యార్థినికి రికార్డు పత్రాలను అందించి అభినందించిన ఉపాధ్యాయులు

మణికొండ: సాంఘీక సంక్షేమ శాఖ నార్సింగి గురుకుల పాఠశాల విద్యార్థిని కడకుంట్ల లహరిశ్రీ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకుంది. హైదరాబాద్ కేంద్రంగా ఇండో నేపాల్ ఇంటర్నేషనల్ ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్‌లో ఆమె నిముషం వ్యవధిలో అత్యధిక పంచ్‌లు కొట్టి ఈ రికార్డును సాధించింది. అందుకు సంబంధించిన ధ్రువపత్రం గురువారం నార్సింగిలోని పాఠశాలలో బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ..చదువులతో పాటు విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి




శంషాబాద్ పట్టణంలో ర్యాలీ

శంషాబాద్: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ అన్నారు. మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా పట్టణంలో పోలీసులు వివిధ కళాశాలల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. నో డ్రగ్స్ నినాదాలతో బస్టాండ్ చౌరస్తా నుంచి సిద్ధాంతి, సవేరా కేఫ్ తదితర బస్తీల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐ బాలరాజు తదితరులున్నారు.

రోడ్లపై చెత్తను వేస్తే చర్యలు తప్పవు

బండ్లగూడ: రోడ్లపై చెత్తను వేస్తే చర్యలు తప్పవని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. హైదర్షాకోట్ గ్రామంలోని ఎర్రకుంట కట్టపై ప్రతిరోజూ ప్రజలు చెత్తను తీసుకువచ్చి వేస్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోవడం లేదని 16వ డివిజన్ ఇన్‌చార్జి టింకురెడ్డితో కలిసి సొంత నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు సురేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

అత్తాపూర్: పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మెహర్రం పండుగకు సంబంధించిన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పండుగలకు ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, డీఐ రవి, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీను ఉన్నారు.

రేషన్.. పరేషాన్!

- రోజుల తరబడి ప్రజల నిరీక్షణ
- ఇబ్బంది పడుతున్న డీలర్‌లు
- రేషన్ షాపులు పెంచాలని డిమాండ్
- పట్టించుకోని అధికారులు



నార్సింగిలో బియ్యం రాక మూసి ఉన్న రేషన్‌షాపు



మణికొండలో తగ్గని రేషన్ లబ్ధిదారుల క్యూలైన్

మణికొండ: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 500 మంది కార్డు దారులకు ఓ రేషన్ షాపు ఉండాలి. అలాంటిది ఏకంగా ఒక్కో షాపునకు 1500 లబ్ధిదారులు ఉన్నా వాటి పెంపు విషయాన్ని అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డు దారులు ఎక్కడైనా బియ్యం తీసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో వేలాది మంది ఉపాధి నిమిత్తం వచ్చి స్థిరపడిన వారు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల పరిధిలోని రేషన్ షాపులలో తమ బియ్యం తీసుకుంటున్నారు. గత నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుండటం, జూన్ నెలలో కేంద్ర ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని లబ్ధిదారులకు ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో రేషన్ షాపుల వద్ద ఈనెల మొదటి వారంలో మొదలైన క్యూలైన్‌లు నెలాఖరు వచ్చినా ఏ మాత్రం తగ్గడం లేదంటే ఆయా మండలాల పరిధిలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారుల సంఖ్యను అర్థం చేసుకోవచ్చు. జూన్ నెలలో ప్రతి లబ్ధిదారుడు మూడు సార్లు వేలి ముద్ర వేసి మూడు సార్లు బియ్యం తీసుకోవాల్సి వస్తుంది. దీంతో ఒక్కో లబ్ధిదారునికి 15 నిమిషాల సమయం పడుతుండటంతో డీలర్‌లు ప్రతిరోజూ 30 నుంచి 50 మంది లబ్ధిదారులకు మాత్రమే బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.



నార్సింగిలో బారులు తీరిన ప్రజలు

అదనపు బాధ్యతలతో ఇబ్బంది..

గండిపేట మండల పరిధిలో అధికారుల లెక్కకు 26 రేషన్ షాపులు ఉన్నా వాటిల్లో మూడు పనిచేయటం లేదు. మణికొండలో ఓ షాపు మూత పడి ఏళ్లు గడుస్తున్నా కొత్త వారికి దాన్ని కేటాయించలేదు. మరో డీలర్‌కు అదనపు బాధ్యతలను కేటాయించటంతో రెండు షాపుల వారు ఒకే డీలర్ వద్ద బియ్యం తీసుకుంటున్నారు. ఇదే తరహాలో పుప్పాలగూడలోని షాపును నార్సింగి డీలర్‌కు అదనంగా కేటాయించారు. దీంతో అతను ఒక రోజు నార్సింగిలో, మరో రోజు పుప్పాలగూడలో బియ్యాన్ని ఇస్తున్నారు. నార్సింగిలో అధికారుల లెక్క ప్రకారం మూడు షాపులు ఉన్నా రెండు మాత్రమే పనిచేస్తున్నాయని, అందులో ఒక డీలర్ పుప్పాలగూడలోను ఇస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

36కు బదులుగా 23 షాపులు..

గండిపేట మండల పరిధిలో ఇటీవల ఇచ్చిన కొత్త కార్డులు కాకుండానే 15502 రేషన్ కార్డులు, 622 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఒక్కో రేషన్ షాపుకు 500 కార్డుల చొప్పున కేటాయిస్తే 32 రేషన్ షాపులను కేటాయించాల్సి ఉంది. అలాంటిది లెక్కలలో 26 ఉన్నా అందులో 23 మాత్రమే పనిచేస్తుండటంతో డీలర్‌లపై పనిభారంతో పాటు లబ్ధిదారులకు పలుమార్లు షాపుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త కార్డులు గండిపేట మండల పరిధిలో మరో 2వేల వరకు ఉన్నట్టు సమాచారం. వాటిని కలుపుకుంటే మరో నాలుగు షాపులను అధికంగా పెంచాల్సి ఉంటుంది.

సమీపంలో ఏర్పాటు చేయాలి..



మణికొండ గ్రామంలో గతంలో రెండు రేషన్‌షాపులు ఉండగా ప్రస్తుతం ఒకటి మాత్రమే ఉంది. అది మణికొండ క్వార్టర్స్, చిత్రపురి కాలనీవాసులకు దూరంగా ఉంది. దీంతో ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి పలుమార్లు షాపునకు వెళ్లి గంటల తరబడి లైన్‌లో నిల్చుని బియ్యం తీసుకుంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కార్డుల నిష్పత్తికి అనుగుణంగా రేషన్ షాపులను పెంచడంతో పాటు వాటిని లబ్ధిదారులకు సమీపంలో ఏర్పాటు చేయాలి.
– గణేష్, మణికొండ

కలెక్టర్‌కు నివేదిక పంపిస్తాం..



గండిపేట మండల పరిధిలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. ఈనెల మూడు నెలల బియ్యం ఇవ్వటంతో ఒక్కొక్కరికే ఎక్కువ సమయం తీసుకుంటున్న విషయం వాస్తవం. ఇతర జిల్లాల వారు స్థానికులకంటే ఎక్కువ మంది బియ్యం తీసుకుంటున్నారు. పౌరసరఫరాల శాఖ వారే షాపులను పెంచాలని తమకు లేఖ రాస్తే డీలర్‌ల ఎంపిక చేపడతాం. అయినా ప్రజల ఇబ్బందిని తీర్చేందుకు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తాం. – శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్, గండిపేట

రోజుల తరబడి తిరుగుతున్నాం..



మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడం, సన్న బియ్యం ఇస్తుండటంతో కార్డు ఉన్న ప్రతిఒక్కరూ షాపునకు వచ్చి తీసుకుంటున్నారు. దీంతో ప్రతిరోజు వందల మంది షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. కొందరు వారం, పది రోజుల పాటు పనులన్నీ మానుకుని బియ్యం తీసుకోవాల్సి వస్తుంది. స్థానికుల కంటే ఇతర ప్రాంతాల వాసులు అధికంగా బియ్యం తీసుకునేందుకు వారి సమీపంలోని రేషన్ షాపులకు వస్తున్నారు. – మహమ్మద్ అఫ్రోజ్, నార్సింగి

రెవెన్యూ అధికారులే షాపులు పెంచాలి..

ఏ మండలం, డివిజన్‌లోనైనా రేషన్ షాపులను పెంచాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ రెవెన్యూ శాఖ వారే జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపాలి. కలెక్టర్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు ఆ విషయాన్ని తెలుపుతూ లేఖ రాస్తారు. కమిషనర్ అనుమతి ఇస్తే కొత్త షాపులను ఏర్పాటు చేసుకోవచ్చు. గండిపేట తహసీల్దార్, రాజేంద్రనగర్ ఆర్డీఓలు షాపుల పెంపు విషయాన్ని కలెక్టర్‌కు రాస్తే పెంపు విషయం పరిశీలిస్తాం.
– వనజాక్షి, జిల్లా పౌర సరఫరాల అధికారి

గోల్కొండ అమ్మవారికి తొలి బోనం



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న పెండ్యాల కుటుంబ సభ్యులు

రాజేంద్రనగర్: గోల్కొండ బోనాల ఉత్సవాల్లో భాగంగా గురువారం జగదాంబిక అమ్మవారికి తొలి బోనం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బుద్వేల్‌కు చెందిన పెండ్యాల కుటుంబ సభ్యులు 30 ఏళ్లుగా మొదటి రోజే కుటుంబ సభ్యులంతా కలిసి తెల్లవారుజామున ఇంట్లో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గోల్కొండ ప్రాంతానికి చేరుకుంటారు. అక్కడ మొదటి మెట్టు నుంచి అమ్మవారి ఆలయ గడప వరకు ప్రతి మెట్టుకు గంధం పూసి పసుపు, కుంకుమలతో బొట్టు పెడుతూ ముందుకునడుస్తారు. 30 ఏళ్లుగా తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెండ్యాల శ్రీధర్ కుటుంబసభ్యులు వివరించారు. జగదాంబ అమ్మవారితో పాటు ఎల్లమ్మ, మహంకాళమ్మ అమ్మవార్లను దర్శించుకొని పూజా కార్యక్రమాలను గురువారం నిర్వహించినట్లు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న మున్సిపల్ ఉద్యోగులకు వీడ్కోలు



సన్మానిస్తున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, కమిషనర్లు శరత్‌చంద్ర, కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేనేజర్‌గా పని చేస్తున్న మంజుల, ఎం.ఎ నదీర్ రెవెన్యూ ఉద్యోగి బదిలీపై వెళ్తున్నారు. అసిస్టెంట్ కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా, కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం అభినందన వీడ్కోలు సభ కమిషనర్ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆత్మీయ అతిథిలుగా కమిషనర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు కృష్ణమోహన్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తొలి నాళ్లలో వృత్తిపరమైన పోటీతత్వం, సమయపాలన, క్రమశిక్షణ, చేసేపనిపై నిబద్ధత కలిగి ఉండాలన్నారు. బదిలీ అంశం కొంత బాధగానే ఉన్నప్పటికీ, ఉద్యోగి జీవితంలో బదిలీ అనేది సర్వసాధారణమన్నారు. కార్యక్రమంలో మణికొండ కమిషనర్ ప్రదీప్, మొయినాబాద్ కమిషనర్ ఖాజా డీఈ యాదయ్య, టీపీఎస్ డి.రాకేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



గగన్‌పహాడ్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: భావితరాల బంగారు భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్‌గౌడ్, బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూట్ మెంబర్ బుక్క వేణుగోపాల్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో గగన్‌పహాడ్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రధాని మోదీ అమ్మ పేరుపై ఒక మొక్క పిలుపు మేరకు జిల్లాలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే దాదాపు 74 వేల మొక్కలను జిల్లా మొత్తం నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యతిపతి శ్రీధర్, అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్‌యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాడెం సుధాకర్, రాష్ట్ర మజ్దూర్ సెల్ కార్యవర్గం సభ్యులు అడికే రాజు, పార్లమెంట్ దళిత మోర్చా ఇన్‌చార్జి జోగి రవి, జయానంద్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నషాముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన ర్యాలీ



శంషాబాద్ రూరల్: పాల్మాకుల మోడల్ స్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం నషాముక్త్ భారత్ అభియాన్‌పై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, అక్రమ రవాణా నేరాలపై అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రజినికుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వర్, ఎస్ఐ నర్సింహరావు, వైద్య సిబ్బంది ఉస్మాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, నిర్మల, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి, పొడి, హానికర చెత్తపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను చెత్త సేకరణ కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని ఓంనగర్ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు కమిషనర్ అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు. అలాగే 9వ డివిజన్ కిస్మత్‌పూర్‌లో మూసీ నదిలో దోమల లార్వా ఎదుగుదలను నియంత్రించేందుకు స్ప్రే చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ఎస్.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ ఎన్.వెంకటప్ప, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



మాట్లాడుతున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్

బండ్లగూడ: తెలంగాణ పోలీస్ అకాడమీలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణలో మత్తు పదార్థాల వినియోగాన్ని నివారించి డ్రగ్స్ ఫ్రీ స్టేట్‌గా చేసేందుకు పోలీసు, ఎక్సైజ్ అధికారులకు ఎన్‌డీపీఎస్ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 22 దఫాలుగా 2551 మంది అధికారులకు ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తుపై అకాడమీలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మురళీధర్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ ధనజ, కోర్సు కో ఆర్డినేటర్లు భాస్కర్, రఘునందన్, అమృతారెడ్డి, డీఎస్పీలు, కోర్సు ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కమిషనర్ సమావేశం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ బి.శరత్‌చంద్ర అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, తాగునీటి వనరులు, ఇందిరమ్మ ఇండ్లు, రీవెరిఫికేషన్, వివిధ వార్డుల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్, ఆర్థిక సంవత్సరం 2025–26లో లక్ష్యంపై చర్చించారు. ఈ సమావేశంలో వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, డీఈఓలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్పీలు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

జూలై 15 వరకు దరఖాస్తు గడువు పొడగింపు

రాజేంద్రనగర్: పి.వి.నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయ పరిధిలోని మామునూరు, వరంగల్ జిల్లాలోని పశు సంవర్థక పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తు గడువును పొడగించినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎం.ఉదయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 2025–26 విశ్వవిద్యాలయ పరిధిలోని పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేయగా..99 సీట్లుకు కేవలం 52 అడ్మిషన్లు మాత్రమే రావడంతో విశ్వవిద్యాలయం దరఖాస్తు చేసుకోడానికి చివరి తేదీని జూలై 15వ తేదీ వరకు పొడగించడం జరిగిందన్నారు.

నేత్రదానం

అత్తాపూర్: మరణాంతరం నేత్రదానం చేస్తే మనం భౌతికంగా లేకపోయినా మన నేత్రాలు ప్రపంచాన్ని చూస్తుంటాయని అత్తాపూర్ అగర్వాల్ సేవా దళ్ గౌరవ అధ్యక్షుడు మనీష్ అగర్వాల్ అన్నారు. హైదర్‌గూడకు చెందిన రాజేందర్‌కుమార్‌జైన్(75) గురువారం ఉదయం సహజ మరణం చెందారు. ఆయన సోదరుడు వినోద్‌కుమార్ జైన్ కుటుంబ సభ్యుల కోరిక మేరకు రాజేందర్‌కుమార్ జైన్ నేత్రాలను సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి నేత్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ..ప్రమాదంలో మరణించిన, సహజ మరణం సభవించిన వెంటనే శరీరంలో ఉన్న అవయవాలను దానం చేయాలనుకునే దాతలు వైద్యులను సంప్రదించాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నన మున్సిపల్ కమిషనర్

మణికొండ: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం నార్సింగి సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల్లో విద్యార్థులకు తడి, పొడి చెత్తలతో పాటు పరసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఇంటి నుంచి తడి, పొడి, హానికార చెత్తలను వేరుగా సేకరిస్తున్నామని, మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతు భరోసా సంబరాలు

శంషాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. రైతు భరోసా విడుదల సందర్భంగా పట్టణంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేస్తోందన్నారు. రైతుల అభ్యున్నతికి నిరంతర కృషి చేస్తున్నది ఒక్క కాంగ్రెస్ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, డీసీసీ అధికార ప్రతినిధి మైలారం సులోచన, మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, విజయ, బొబ్బిలి కిష్టయ్య, మహ్మద్‌గని, శ్రీధర్‌యాదవ్, శేఖర్, శేఖర్‌గుప్తా, అక్రమ్, శ్రీధర్, గుంటి ప్రవీణ్, రమేష్, అశోక్, లింగం, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



శంషాబాద్‌లో సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు